RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, అక్టోబరు 14, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 160 | పేజీలు: 8 | వెల : రూ.1




### దీపావళి తర్వాతే యూపీఐ ఛార్జీలు!

వ్యాపారుల విజ్ఞప్తితో వాయిదా వేసిన ఎన్‌పీసీఐ

రూ.2 వేలకు పైబడిన ఎంపిక చేసిన లావాదేవీలపై 0.4% ఎండీఆర్

వినియోగదారులపై భారం ఉండదని స్పష్టీకరణ

# తెలంగాణలోకి ఈశాన్య రుతుపవనాలు!

### అక్టోబర్ 15--18 మధ్య ప్రవేశించే అవకాశం

### పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు

### ఏపీకి కూడా వర్ష సూచన.. తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు

హైదరాబాద్, అక్టోబరు 13 : ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఈశాన్య రుతుపవనాల ప్రవేశానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వెల్లడించింది. అక్టోబర్ 15 నుంచి 18 మధ్య తెలంగాణలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం ఖమ్మం, ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇతర జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడవచ్చని, మరికొన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగవచ్చని పేర్కొంది. వర్షాల కారణంగా ప్రస్తుతం నెలకొన్న ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో



ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. తీర ప్రాంతాల్లో వర్షాల సమయంలో గంటకు 30--40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

# తెలుగు గంగ నీటి విడుదల పెంచాలి

### చంద్రబాబుకు తమిళనాడు సీఎం విజయ్ విజ్ఞప్తి

### ఈ ఏడాది చెన్నైకి 4.08 టీఎంసీల నీరు అందించాం: ఏపీ సీఎం

విజయవాడ: చెన్నై నగర తాగునీటి అవసరాల కోసం తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదలను పెంచాలని తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఇరువురు ముఖ్యమంత్రులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలుగు గంగ నీటి సరఫరా, గోదావరి--కావేరి నదుల అనుసంధానంపై చర్చించారు. ఈ ఏడాది చెన్నైకి 4.08 టీఎంసీల నీటిని అందించినట్లు చంద్రబాబు వివరించారు. మరింత నీటిని విడుదల చేయాలని విజయ్ విజ్ఞప్తి చేయగా, నీటి లభ్యతను బట్టి నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు బదులిచ్చారు. కృష్ణా జలాలను చెన్నైకి తరలించే లక్ష్యంతో తెలుగు గంగ ప్రాజెక్టును చేపట్టారు. శ్రీశైలం జలాశయం నుంచి సోమశిల, కండలేరు జలాశయాల మీదుగా చెన్నైకి నీటిని సరఫరా చేస్తారు. ఈ ప్రాజెక్టు చెన్నై తాగునీటి అవసరాలకు కీలకంగా ఉంది. సమావేశంలో ఏపీ మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని చంద్రబాబు.. విజయ్‌కు పరిచయం చేశారు. అంతకుముందు సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న విజయ్‌కు మంత్రి నారా లోకేశ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



# విద్యతోనే సామాజిక, ఆర్థిక అసమానతల నిర్మూలన

### ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం

### 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

### విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నాం: డిప్యూటీ సీఎం భట్టి




హైదరాబాద్: విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్యారంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ భారీగా నిధులు కేటాయించడంతోపాటు విప్లవాత్మక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచంతో పోటీపడే స్థాయిలో తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గురు వందనం--ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్--2026' కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. విద్య కేవలం ఉద్యోగం సంపాదించేందుకు మాత్రమే కాకుండా, వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనమైన కుటుంబాల అభివృద్ధికి శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నామని, వారానికి మూడు రోజులు పాలు లేదా రాగిజావ ఇచ్చే కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

#### 105 యంగ్ ఇండియా పాఠశాలలు

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఒక్కో పాఠశాలలో 2 వేల నుంచి 2,500 మంది విద్యార్థులు చదువుకునేలా ఆధునిక వసతులతో నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు, ఇతర పాఠ్యేతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఉపాధ్యాయులకు పాఠశాల ప్రాంగణాల్లోనే నివాస సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా విద్యను ప్రోత్సహించేందుకు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు.

#### నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు ఐటీఐలను ఆధునీకరిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులకు పాఠాలు బోధించడంతోపాటు వారిని విలువలతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్య సాధనలో విద్యారంగం, ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు భవిష్యత్తులో కీలక మార్పులకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పిల్లల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు అని, నాణ్యమైన విద్యతోనే సమానత్వంతో కూడిన అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని భట్టి విక్రమార్క అన్నారు.



# తెలంగాణకు జాతీయ రహదారుల వరాలు

### ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం

### పర్వతమాల పథకంలో ఐదు రోప్‌వేలు.. సేతు బంధన్‌లో మూడు ఆర్‌ఓబీలు

### కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జికి సానుకూలత.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కోమటిరెడ్డి భేటీ

హైదరాబాద్, అక్టోబరు 13: తెలంగాణలో రహదారుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నుంచి కీలక హామీలు లభించాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేలు, సేతు బంధన్ పథకంలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కోమటిరెడ్డి సమావేశమై రాష్ట్రంలోని రహదారి ప్రాజెక్టులపై చర్చించారు. కృష్ణా నదిపై ప్రతిపాదించిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనపైనా కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-765)పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కొత్తగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని గడ్కరీ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన 34 రహదారి పనులకు సీఆర్‌ఐఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరగా, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను గడ్కరీ ఆదేశించినట్లు తెలిపారు.

#### రాష్ట్ర రహదారులకు జాతీయ హోదా

పుల్లూరు--అలంపూర్--జటప్రోలు--పెంట్లవెల్లి--కొల్లాపూర్--లింగాల--అచ్చంపేట--డిండి--దేవరకొండ--మల్లేపల్లి--నల్గొండ మార్గాలను జాతీయ రహదారులుగా గుర్తించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలపైనా సానుకూల స్పందన లభించిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలకు హాజరుకావాలని కోమటిరెడ్డి గడ్కరీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, సమావేశాలకు హాజరవుతానని హామీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.



# ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

కాంగ్రెస్‌ది ప్రజాస్వామ్యంపై ద్వంద్వ వైఖరి

తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు

వాయిస్ ఆఫ్ ప్రజలు

బుధవారం, అక్టోబరు 14, 2026

# సింగరేణి కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**దసరా కానుకగా లాభాల్లో 34 శాతం వాటా**

**38,737 మంది శాశ్వత ఉద్యోగులకు సగటున రూ.1,53,912**

**కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500**

**కార్మికుల సొంతింటి కల సాకారానికి 'నెహ్రూ హౌసింగ్ కాలనీలు'**

**ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



హైదరాబాద్: సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దసరా పండుగ కానుకగా సంస్థ పన్నుల అనంతర నికర లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సింగరేణి సంస్థ ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో సుమారు రూ.596 కోట్లను కార్మికులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో 38,737 మంది శాశ్వత ఉద్యోగులకు ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 లభిస్తుందని చెప్పారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా 29,717 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నట్లు వెల్లడించారు. శాశ్వత ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.

### పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

సింగరేణిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని భట్టి విక్రమార్క తెలిపారు. 250 నుంచి 300 డిపెండెంట్ నియామకాలకు సంబంధించిన ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. మారుపేర్ల సమస్యను అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా మానవీయ కోణంలో పరిష్కరిస్తామన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని ఏరియా ఆసుపత్రుల్లో నెలకు ఒకసారి మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కరోనా సమయంలో, ఇతర కారణాలతో విధులకు హాజరుకాలేక ఉద్యోగాలు కోల్పోయిన వారి సమస్యలను వన్‌టైమ్ ఆప్షన్ కింద పరిశీలించి తిరిగి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### కార్మికులకు సొంతింటి కల

సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు మైనింగ్ జరగని అనువైన భూములను గుర్తించి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరుతో 'నెహ్రూ హౌసింగ్ కాలనీలు' ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. శిథిలావస్థకు చేరిన డి-టైప్ క్వార్టర్ల స్థానంలో అన్ని వసతులతో ఆధునిక నివాస సముదాయాలు నిర్మిస్తామన్నారు. జీవో నంబర్ 76 ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని వేగవంతం చేస్తామని, నెల రోజుల్లో అర్హుల జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లు, సింగరేణి అధికారులతో కూడిన కమిటీని ఆదేశించినట్లు చెప్పారు.

### ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలు

సింగరేణి ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నిపుణులైన వైద్యులను నియమించడంతోపాటు కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ వంటి అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కాలనీల్లో డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని, కార్మికులకు ప్రతి ఆరు నెలలకు భద్రతా కిట్లు అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. అధికారులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ చెల్లింపులపైనా నిర్ణయం తీసుకున్నామన్నారు.

### సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక

సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. నిరుపయోగ భూములు, ఓవర్‌బర్డెన్ గుట్టలను సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించేలా చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తితోపాటు స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

### సంస్థ బలోపేతంపై దృష్టి

గత ఏడాదితో పోలిస్తే ఈసారి సింగరేణి లాభాలు తగ్గడానికి పలు కారణాలున్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాకులను సాధించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బొగ్గు మార్కెట్‌లో పోటీ పెరగడంతో ధరలను హేతుబద్ధీకరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాకుల సాధన, వ్యాపార విస్తరణ, బకాయిల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. సింగరేణిని ఆర్థికంగా బలోపేతం చేస్తూనే కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కార్మికుల శ్రమకు తగిన గౌరవం, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొంటూ సింగరేణి ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబాలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# ఆత్మకూరులో రూ.8.91 కోట్లతో నాలుగు లేన్ల రహదారి

**2.2 కిలోమీటర్ల మేర అభివృద్ధి.. 'వాయుపుత్ర మార్గ్'గా నామకరణం**

**మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



ఆత్మకూరు: గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ, ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ.8.91 కోట్లతో అభివృద్ధి చేసిన నాలుగు లేన్ల రహదారిని మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. 2.2 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసిన ఈ రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణ ప్రజలు జాతీయ రహదారి ఎన్‌హెచ్-67కు చేరుకునేందుకు గతంలో ఇరుకైన, గుంతలతో కూడిన రహదారిపై ప్రయాణించాల్సి వచ్చేదన్నారు. దీంతో స్థానికులు, విద్యార్థులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఈ సమస్యను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో రహదారి అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6.31 కోట్లతో 2.2 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారిని విస్తరించామని, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో మరో రూ.2.60 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉన్నందున, భక్తుల విశ్వాసానికి గుర్తుగా ఈ రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా పేరు పెట్టినట్లు వెల్లడించారు.

### పల్లె పండుగతో రహదారుల అభివృద్ధి

రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల కింద 9 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించామని, మరో 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్లకు అనుమతులు ఇచ్చామని పవన్ కల్యాణ్ తెలిపారు. పల్లె పండుగ 3.0లో భాగంగా మరో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు 161 డొంక రోడ్ల నిర్మాణానికీ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

### వీర్లగుడిపాడు వంతెనకు ప్రతిపాదనలు

సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు, చర్యలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధార కింద రూ.72 కోట్లతో 391 సింగిల్ విలేజ్ స్కీమ్‌ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూ నాయక్ తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణకు ఎల్‌నినో గండం!

**50 డిగ్రీలకు చేరనున్న ఉష్ణోగ్రతలు?**

**రానున్న పది నెలలు తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఆందోళన**

**ములుగులో విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు**

**హైదరాబాద్‌లోనూ తాగునీటి ఎద్దడి తప్పదా?**



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో రానున్న రోజుల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల వరకు చేరే ప్రమాదం ఉందన్న అంచనాలు కలవరపెడుతున్నాయి. మరోవైపు సాగునీరు, తాగునీటి కొరత వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ములుగు నియోజకవర్గంలోని మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఐదు నుంచి ఆరు గంటలు మాత్రమే కరెంటు వస్తోందని ఆరోపిస్తున్నారు. సకాలంలో విద్యుత్ అందక బోర్ల నుంచి నీటిని తోడలేక పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు.

### పడిపోతున్న భూగర్భ జలాలు

రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. రోజుకు దాదాపు మూడు అడుగుల మేర నీటిమట్టం తగ్గుతోందని అంచనాలు చెబుతున్నాయి. సాధారణ స్థాయితో పోలిస్తే జలాశయాల్లో ప్రస్తుతం నీటి నిల్వలు సుమారు 50 శాతానికే పరిమితమైనట్లు సమాచారం. దీంతో అందుబాటులో ఉన్న నీటిని సాగు అవసరాలకు కాకుండా తాగునీరు, పశువుల అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.

### హైదరాబాద్‌కూ తప్పని నీటి కష్టాలు?

వర్షాభావ పరిస్థితులు కొనసాగితే గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లోనూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాల లభ్యత పడిపోవడం నగర నీటి అవసరాలపై ప్రభావం చూపవచ్చు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నీటి వనరుల సంరక్షణ, విద్యుత్ సరఫరా, సాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

# ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

**కాంగ్రెస్‌ది ప్రజాస్వామ్యంపై ద్వంద్వ వైఖరి**

**తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారు**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు**



హైదరాబాద్: ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేపడుతుంటే, తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల ఆందోళనలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో పాటు పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీ, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, సైన్యంపై విమర్శలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఆయన ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోలేదని పేర్కొన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న నిరసన హక్కులు తెలంగాణలో బీజేపీ నేతలకు ఎందుకు ఉండవని ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దాని విలువలను ఆచరించాలని కాంగ్రెస్‌కు హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దేనని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## జనసేన సోషల్ మీడియాలో రామ్ తాళ్లూరి, నాదెండ్ల మనోహర్ టార్గెట్!

**ద్వితీయ శ్రేణి నాయకత్వంపై జనసైనికుల అసంతృప్తి**

**సీట్ల సర్దుబాటు, స్థానిక ఎన్నికల నిర్ణయాలపై విమర్శలు**

**పార్టీ వ్యవహారాలపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి**

విజయవాడ, అక్టోబరు 13: జనసేన పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకత్వంపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరిని లక్ష్యంగా చేసుకుని కొందరు జనసేన అభిమానులు, కార్యకర్తలు పోస్టులు పెడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ నిర్ణయాల్లో వీరిద్దరి జోక్యం ఎక్కువైందని, స్థానిక నాయకులకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, కూటమిలో సీట్ల సర్దుబాటు, నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ఎంపిక విషయంలో తమకు అన్యాయం జరుగుతుందనే ఆందోళన స్థానిక నాయకుల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ద్వితీయ శ్రేణి నాయకత్వం కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఒత్తిడిని ఎదుర్కొంటోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పార్టీ వ్యవహారాలపై మరింత దృష్టి సారిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కీలక రాజకీయ నిర్ణయాలు, పార్టీ కమిటీల నియామకాలు, ఎన్నికల వ్యూహాల విషయంలో ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే పార్టీ బలోపేతానికి ద్వితీయ శ్రేణి నాయకత్వానికి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.




# దీపావళి తర్వాతే యూపీఐ ఛార్జీలు!

**వ్యాపారుల విజ్ఞప్తితో వాయిదా వేసిన ఎన్‌పీసీఐ**

**రూ.2 వేలకు పైబడిన ఎంపిక చేసిన లావాదేవీలపై 0.4% ఎండీఆర్**

**వినియోగదారులపై భారం ఉండదని స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, అక్టోబరు 13: యూపీఐ ద్వారా నిర్వహించే ఎంపిక చేసిన వ్యాపార లావాదేవీలపై ప్రతిపాదించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీల అమలును నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వాయిదా వేసింది. పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యాపారుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. దీపావళి తర్వాత కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయని, కచ్చితమైన తేదీని త్వరలో వెల్లడిస్తామని తెలిపింది. మంగళవారం సమావేశమైన యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత సెప్టెంబరులో రూ.2,000కు మించిన ఎంపిక చేసిన పర్సన్ టు మర్చంట్ (పీ2ఎం) లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించాలని ప్రతిపాదించారు. ఈ లెక్కన రూ.2,000 లావాదేవీపై రూ.8, రూ.10,000 లావాదేవీపై రూ.40 చొప్పున వ్యాపారులు ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠ ఛార్జీని రూ.300గా పరిమితం చేసినట్లు ప్రతిపాదనలో పేర్కొన్నారు. రైల్వే, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ముడిసరుకుల వంటి ఎంపిక చేసిన రంగాల్లో రూ.2,000కు మించిన లావాదేవీలకు ఫ్లాట్‌గా రూ.5 ఛార్జీ విధించే ప్రతిపాదన కూడా ఉంది. వ్యక్తుల మధ్య జరిగే పీ2పీ లావాదేవీలకు, రోజువారీ చిన్న వ్యాపార లావాదేవీలకు ఈ ఛార్జీలు వర్తించవని స్పష్టం చేశారు. ప్రతిపాదిత ఎండీఆర్ భారం వినియోగదారులపై కాకుండా వ్యాపారులపైనే ఉంటుందని వెల్లడించారు. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, సైబర్ భద్రత, మోసాల నివారణ, వినియోగదారుల సేవలకు అవసరమైన నిధుల సమీకరణ లక్ష్యంగా ఈ ఛార్జీల ప్రతిపాదన చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.?

# హైదరాబాద్‌కు చేరుకున్న భారత్, వెస్టిండీస్ జట్లు

**ఉప్పల్ స్టేడియంలో అక్టోబర్ 14న నాలుగో టీ20 మ్యాచ్**

**విమానాశ్రయం నుంచి హోటల్ వరకు భారీ భద్రత**

హైదరాబాద్: భారత్, వెస్టిండీస్ క్రికెట్ జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. అక్టోబర్ 14న ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న నాలుగో టీ20 మ్యాచ్‌లో పాల్గొనేందుకు ఇరు జట్ల ఆటగాళ్లు నగరానికి వచ్చారు. విమానాశ్రయం నుంచి ప్రత్యేక బస్సుల్లో స్టార్ హోటళ్లకు వెళ్లారు. జట్ల రాక నేపథ్యంలో విమానాశ్రయం నుంచి హోటళ్ల వరకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. మ్యాచ్ నేపథ్యంలో నగరంలో క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికపై జనసేనలో ఆసక్తికర చర్చ!

## పవన్ కళ్యాణ్‌కు సన్నిహితుడైన పారిశ్రామికవేత్తకు అవకాశం దక్కేనా?

## కూటమికి సంబంధం లేకుండా సొంతంగా పోటీ చేసే ఆలోచనలో జనసేన!

ఖైరతాబాద్ : అక్టోబర్ 13 ( వాయిస్ టుడే ) హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో జనసేన పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో జనసేన తరఫున ఎవరిని బరిలోకి దింపుతారనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండే, పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ప్రముఖ పారిశ్రామికవేత్తకు అవకాశం కల్పించే అంశంపై ప్రచారం సాగుతోంది.

సాఫ్ట్‌వేర్, వ్యాపార రంగాల్లో విశేష అనుభవం కలిగి, సమాజం పట్ల బాధ్యతతో పాటు ప్రజాసేవపై ఆసక్తి ఉన్న నాయకుడిని ఎన్నికల బరిలోకి దింపాలనే ఆలోచన పార్టీలో ఉందనే చర్చ వినిపిస్తోంది. వివాదాలకు దూరంగా ఉంటూ, వ్యాపార రంగంలో సంపాదించిన అనుభవాన్ని ప్రజాసేవకు వినియోగించగల వ్యక్తికి అవకాశం కల్పిస్తే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణలో జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతతో పాటు వివిధ సామాజిక వర్గాలకు చేరువ కావడం వంటి అంశాలపై పార్టీ దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఎన్నిక ద్వారా పార్టీ ప్రజల్లో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపైనా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వ్యాపార, సాంకేతిక రంగాల్లో అనుభవం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తే అభివృద్ధి, ఉపాధి కల్పన, యువతకు అవకాశాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై వినూత్న ఆలోచనలకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సదరు పారిశ్రామికవేత్తకు జనసేన తరఫున అవకాశం దక్కుతుందా? తెలంగాణలో పార్టీ నాయకత్వం ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం ఎలాంటి వ్యూహాన్ని అనుసరించనుంది? అన్న అంశాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

అయితే, ఖైరతాబాద్ ఉప ఎన్నికలో జనసేన అభ్యర్థి ఎంపికకు సంబంధించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రచారంలో ఉన్న ఈ అంశాలపై స్పష్టత రావాలంటే పార్టీ అధిష్ఠానం నిర్ణయం వెలువడే వరకు వేచి చూడాల్సిందే. రానున్న రోజుల్లో జనసేన అనుసరించే వ్యూహం, అభ్యర్థి ఎంపికపై వెలువడే ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారనుంది.



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవిని వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించాలి

### వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ డిమాండ్

హైదరాబాద్:అక్టోబర్ 13 (వాయిస్ టూ డే) తెలంగాణ రాష్ట్రంలో రాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాల్లో వడ్డెర సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 25 లక్షల మందికి పైగా జనాభా కలిగిన వడ్డెర సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్న తమ వర్గానికి ప్రభుత్వం తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ లెక్కల్లో వడ్డెర సామాజిక వర్గం జనాభా తక్కువగానమోదవుతోందని ఆయన పేర్కొన్నారు. అన్ని రంగాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న వడ్డెరలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాల్లో వడ్డెర సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవిని కేటాయించి, తమ వర్గానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్, గౌరవ అధ్యక్షులు రూపాన్ని లోకనాథం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బోధస్ రవి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు మక్కల ధనలక్ష్మి, పిట్ల గోపాల్ పాల్గొన్నారు.

## ఉస్మానియా వర్సిటీలో సీఐఎస్‌సీఈ జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

### షాట్‌పుట్‌లో రికార్డు సృష్టించిన మహారాష్ట్ర క్రీడాకారిణి




సికింద్రాబాద్ అక్టోబర్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీలో సీఐఎస్‌సీఈ ఏడో జాతీయ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. హబ్సిగూడలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆధ్వర్యంలో వర్సిటీలోని సింథటిక్ అథ్లెటిక్స్ మైదానంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో బాలికలు తమ క్రీడా ప్రతిభను చాటుకోనున్నారు. అంతర్జాతీయ అథ్లెట్ ఎం.కల్పనా రెడ్డి, డాక్టర్ గాడ్విన్ డేనియల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అండర్–19 బాలికల షాట్‌పుట్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన సామి జయదీప్ పాటిల్ 14.69 మీటర్ల దూరం బంతిని విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ క్రమంలో గతంలో ఉన్న 12.01 మీటర్ల రికార్డును అధిగమించారు. నార్త్ ఇండియాకు చెందిన తన్వీర్ కౌర్ సిద్ధూ 13.54 మీటర్లతో రెండో స్థానం సాధించగా, మహారాష్ట్రకు చెందిన సామి నాయక్ మూడో స్థానంలో నిలిచారు. విద్యార్థులు ఈ పోటీల్లో తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి అవకాశం లభించిందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల క్రీడా సమన్వయకర్త, పాఠశాల ప్రిన్సిపల్ థెరిసా తెలిపారు.

## సమాజానికి సేవ చేసే మనస్తత్వం ఉండాలె

### బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

నాచారం (వాయిస్ టుడే): సమాజానికి సేవ చేసే మనస్తత్వం ప్రతి ఒక్కరిలో ఉండాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. విశ్వబ్రాహ్మణ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు పండకండి నరసింహా చారి జన్మదిన వేడుకలు హైదరాబాదులోని బీసీ కుల సంఘాల కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గణేష్ చారి హాజరై శాలువాతో సత్కరించి పూల బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ సమాజంలో మనం బ్రతుకుతూ ఇతరులను బ్రతికిస్తూ ఉపాధి కల్పించడం గొప్ప విషయమన్నారు. ఆ లక్షణాలను నరసింహా చారి అందిపుచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, వనజ, అరవింద్ కుమార్, లహరిక, లాస్య, వల్లబోజు నరసింహాచారి, తాటికొండ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



# సమాజ సేవలో ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం: డా. లక్ష్మణ్







### ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ..

సికింద్రాబాద్, అక్టోబర్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): సమాజ సేవలో ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గం మధురానగర్‌లో బౌద్ధనగర్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్ష కిరణ్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు, నగర పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం సేవలందిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం అభినందనీయమని పేర్కొన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక రెడ్డి, సికింద్రాబాద్ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే సారంగపాణి పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

### – బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదేశాలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 13(వాయిస్ టుడే): 130 – సుభాష్ నగర్ డివిజన్ "వాసు లేఔట్" కాలనీలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, మౌళిక వసతులను మెరుగు పరిచాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ సుభాష్ నగర్ వాసు లే ఔట్ లో గతంలో ఎన్నో రకాల మౌలిక వసతులను కాలనీ అభివృద్ధికి అనుగుణంగా అభివృద్ధి పరిచామని, నూతనంగా ఏర్పాటైన కొన్ని గల్లీలల్లో త్రాగునీటి సరఫరా, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తామన్నారు. కాలనీలో ప్రజలకు ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే మార్చాలని, అదేవిధంగా దోమల బెడదను నివారించేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉప కమీషనర్ లావణ్య, వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, ఇస్మాయిల్, గుబ్బాల లక్ష్మీ నారాయణ, కోల శ్రీకాంత్, సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మలతా రెడ్డి, కాలనీ వాసులు భాస్కర్ రెడ్డి, హరీష్, రమణయ్య, రాంబాబు, శ్రీనివాస్, యోగేష్, ఆది నారాయణ, భాస్కర్ రావు, వెంకటేష్, వందన, స్వాతి, నిత్య, లక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 290వ డివిజన్, సుభాష్ నగర్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నియోజకవర్గ అభివృద్ధికి పార్టీ చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఎం.డి. నదీమ్, ఎం.డి. తఫ్జిత్, ఎం.డి. రఫీక్, ఎం.డి. మునాఫ్, ఎం.డి. సమద్, ఎం.డి. షఫీ, ఎం.డి. ఉసాన్, ఎం.డి. ఇర్ఫాన్, ఎం.డి. ఆవేజ్, ఎం.డి. అజాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో 290వ డివిజన్ అధ్యక్షులు ద్వారంపూడి నాగిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫ్ఫార్, వైస్ చైర్మన్ ఖైమ్ పాషా, సాయిబాబా నగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షులు ఎం.డి. యాసీమ్, ఎం.డి. జబ్బార్, షేక్ ఇర్ఫాన్, రవి, రాజు, ఎం.డి. కైఫ్ తదితర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## రోడ మేస్త్రి నగర్‌లో గోనిది డైరీ మిల్క్ స్టోర్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ రోడ్డు మేస్త్రి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గోనిది డైరీ మిల్క్ స్టోర్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసిన కూన శ్రీశైలం గౌడ్ , ప్రజలకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందిస్తూ వినియోగదారుల ఆదరాభిమానాలు పొందాలని, వ్యాపారంలో అభివృద్ధి సాధించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు సతీష్, కొండప్ప, డివిజన్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్, రఘు రెడ్డి, ఆసిఫ్, ఉదయ్, రాజేష్, రవి పాల్గొన్నారు.

## తాగునీటి పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 13(వాయిస్ టుడే): జగద్గిరి నగర్‌లో తాగునీటి కోసం నూతనంగా చేపట్టిన పైపులైన్ పనులకు మంగళవారం డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కార్పొరేటర్ గా ఎన్నికైన నాటినుండి జగద్గిరిగుట్ట డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పరచడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో పాటు పలు మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. వర్షపాతం తక్కువగా ఉండటం వలన రానున్న కాలంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొగ్గుల సురేష్, తోక యాదగిరి, మనోజ్, మాయ కోటి ప్రభాకర్, బ్రహ్మయ్య, దీ. ప్రభాకర్, కుమారస్వామి, సంతోష్, సత్తిరెడ్డి, విజయ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
బుధవారం 14 అక్టోబరు 2026



## చిన్నక్రాంతి కాలనీలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

### ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరిగే నర్సింహా కురుమ..

మేడిపల్లి/సికింద్రాబాద్ అక్టోబర్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): మేడ్చల్ జిల్లా చెంగిచర్ల డివిజన్ పరిధిలోని చిన్నక్రాంతి కాలనీలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గామాత సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరిగే నర్సింహా కురుమ (జీఎన్కే) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరిగే నర్సింహా కురుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నవరాత్రుల పర్వదినాల్లో అన్నదానం చేయడం పుణ్యకార్యమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టిన శ్రీశైలం యాదవ్ బృందాన్ని అభినందించారు. అమ్మవారి ఆశీస్సులతో చిన్నక్రాంతి కాలనీ ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాసాల కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ధార్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ కాలనీవాసులు ముందుండటం అభినందనీయమన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న కాలనీ అధ్యక్షుడు మేడ బాపిరాజు, నిర్వాహకుడు శ్రీశైలం యాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు పోలు విక్రమ్ గౌడ్, సంజీవ్, కమిటీ సభ్యులు మల్ల మల్లేష్, నరేష్ గౌడ్, చిందాల మల్లేష్, కొండె వెంకటేష్ కురుమ, బొడపట్ల ఉపేందర్ గౌడ్, యాదగిరి గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు, నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



## హామీ నెరవేర్చాకే వర్సిటీ పోస్టుల భర్తీ చేపట్టాలి

### 1,200 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య సమక్షంలో అధ్యాపకుల అత్యవసర సమావేశం

హైద్రాబాద్ (వాయిస్ టుడే): ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, యూజీసీ ఏడో వేతన సవరణ సంఘం (7వ పీఆర్సీ) ప్రకారం వేతనాలు అమలు చేసిన తర్వాతే ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీ చేపట్టాలని విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

గత ఏడాది ఏప్రిల్‌లో ఉద్యోగ భద్రత, రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలు చెల్లించాలనే డిమాండ్లతో 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు 11 రోజులపాటు నిరవధిక సమ్మె నిర్వహించారు. దీంతో విశ్వవిద్యాలయాల్లో బోధన నిలిచిపోయింది. అప్పట్లో ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో అధ్యాపకులు సమ్మె విరమించారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ప్రభుత్వం జీవో నంబరు 31 ద్వారా ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 20--30 ఏళ్లుగా సేవలందిస్తున్నాం. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో సుమారు 1,200 మంది కాంట్రాక్టు అధ్యాపకులు గత 20 నుంచి 30 ఏళ్లుగా సేవలందిస్తున్నారని సమావేశంలో పేర్కొన్నారు. నియామకాలు చేపడితే తమ ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, పని భారం లేదనే కారణంతో తొలగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు రెగ్యులర్ అధ్యాపకులుగా క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించి ఏడో పీఆర్సీ వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపక సంఘం నాయకులు డా. పరుశు రాం, డా. ధర్మతేజ, డా. వెంకటేశ్వర్లు, డా. మోడెమ్ రవి, డా. తిరుపతి, సమర కుమార్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ ఆయురారోగ్యాల కోసం కాచిగూడలో 'రుద్ర హోమం'

## హాజరైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు

కాచిగూడ, అక్టోబర్ 13: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్ కాచిగూడలో ప్రత్యేక రుద్ర హోమం వైభవంగా జరిగింది. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని, బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి. నందకిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తన సతీమణి కావ్య రెడ్డితో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ రుద్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిరోజూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. దేశాన్ని పురోగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా ఆయన తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఈ దేవీ నవరాత్రుల పవిత్ర సందర్భంలో అమ్మవారి ఆశీస్సులతో నరేంద్ర మోడీకి మరింత శక్తి సామర్థ్యాలు లభించాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేసే ఆయురారోగ్యాలను అమ్మవారు ప్రసాదించాలని ప్రార్థించినట్లు చెప్పారు.

ప్రధాని మోడీ ఆరోగ్యంగా ఉండాలని, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే శక్తిని అమ్మవారు ఇవ్వాలని నందకిషోర్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.





## ఆలేరులో మున్నూరు కాపు పటేల్స్ సభ్యత్వ నమోదు పోస్టర్ ఆవిష్కరణ



ఆలేరు: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ సభ్యత్వ నమోదు వెబ్‌సైట్ పోస్టర్‌ను సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ఆవిష్కరించారు. ఆలేరు మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ పటేల్, అధ్యక్షుడు అంజన్న పటేల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్నూరు కాపు సంఘం కమిటీ సభ్యులతో పాటు తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు కుమార్ పటేల్ పాల్గొన్నారు.



## సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ల నిరసన




రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 13 (వాయిస్ టుడే):నెలకు కేవలం రూ.5 వేల స్టైపెండ్(శిక్షణ భృతి)తో వైద్య సేవలు ఎలా అందించాలని ప్రశ్నిస్తూ సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో 31 మంది జూనియర్ డాక్టర్లు నిరసనకు దిగారు. సోమవారం ఓపీ విధులను బహిష్కరించి, ఆసుపత్రి ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ, గత జూన్ నుంచి ఇంటర్న్‌షిప్ విధులు నిర్వహిస్తున్న తమకు నెలకు రూ.5 వేలే చెల్లిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆమోదిత స్టైపెండ్ రూ.29,792 ఉండగా, కేవలం విదేశాల్లో చదువు కున్నామనే నెపంతో తమకు ప్రభుత్వం శిక్షణభృతి అందిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ఎంబీబీఎస్ ఇంటర్న్‌లతో సమానంగా విధులు నిర్వహిస్తు న్నప్పుడు స్టైపెండ్ లో వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. రోజుకు సుమారు రూ.166తో కనీస అవసరాలు కూడా తీర్చుకోవడం కష్టంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం తమకు శిక్షణభృతి చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు సమస్య ను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




## బాధితులకు సత్వర న్యాయం అందించాలి

**-సైబర్ నేరాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి.**

**- డయల్ 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 13 (వాయిస్ టుడే): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వివిధ సమస్య లతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు.పోలీస్ స్టేషన్‌లో వివిధ విభాగాల వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును వ్యక్తిగతంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. డయల్ 112కు కాల్ వచ్చిన వెంటనే పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని, బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ తనిఖీలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ నాగేశ్వర రావు, ఎస్ఐ జ్యోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమానికి రేవంత్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: దిడ్డి రాంబాబు

### బర్కత్‌పురలో నాయీ బ్రాహ్మణ సంఘ ఆత్మీయ కలయిక

హైదరాబాద్, అక్టోబర్ 13: రాష్ట్రంలో బీసీ కులాలు, ఉప కులాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తెలిపారు. బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అనేక వినూత్న పథకాలను అమలు చేస్తోందని దిడ్డి రాంబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీతో పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 'చేయూత' పింఛన్లు మరియు స్వయం ఉపాధి రుణాలు అందిస్తూ అండగా నిలుస్తోందన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి మరియు అభివృద్ధికి ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి తగిన న్యాయం చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ సంక్షేమ పథకానికైనా దళారులు, మధ్యవర్తులను నమ్మి




మోసపోవద్దని, నేరుగా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలను సంప్రదించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు బి. మాణిక్ రావు, గడ్డం కృష్ణ, రఘు, రాము, జి. శ్రీనివాస్, ఆంజనేయులు, దాస్, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ తెలంగాణ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్



కరీంనగర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే):ఈ నెల24,25,26 తేదీలలో రంగారెడ్డి జిల్లా పోరాటాల గడ్డ ఇబ్రహీంపట్నంలో జరగనున్న డివైఎఫ్ఐ తెలంగాణ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్ పిలుపునిచ్చారు.నగరంలోని డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సూర్య భాయ్ అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నరేష్ పటేల్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతున్నదని, చదువుకున్న యువతకు తగిన ఉద్యోగాలు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సమీక్ష జరగాలని,నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు.రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇచ్చిన హామీని నెరవేర్చడంతో పాటు, ఎండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామకాలను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.నోటిఫికేషన్లు, పరీక్షలు, నియామక ప్రక్రియల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని నరేష్ పటేల్ అన్నారు.అర్హులైన నిరుద్యోగ యువతకు పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని, దరఖాస్తుదారులకు రుణాలు,ఆర్థిక సహాయం అందించడంలో జాప్యం చేయకూడదని కోరారు.స్వయం ఉపాధితో పాటు ప్రభుత్వ,ప్రైవేటు రంగాల్లోనూ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని అన్నారు.యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం,విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ,స్వయం ఉపాధి, యువత హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై రాష్ట్ర మహాసభల్లో విస్తృతంగా చర్చించి,భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు అడ్డుకట్ట వేయాలని,ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పేర్కొన్నారు.యువత సమస్యల పరిష్కారం కోసం డివైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని, నిరుద్యోగ యువత తమ హక్కుల సాధన కోసం సంఘటితమై ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో యువజన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి డివైఎఫ్ఐ తెలంగాణ 3వ రాష్ట్ర మహాసభలు దోహదపడతాయని నరేష్ పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏ భాస్కర్.శివ కుమార్. కృష్ణ కోశాధికారి అరవింద్.నాయకులు సంతోష్.లక్ష్మణ్. దేవేందర్.విజయ్.నితిన్.రంజిత్ పాల్గొన్నారు

## కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా తాటిపల్లి రాజన్న నియామకం

### వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం

కరీంనగర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): జిల్లా కాంగ్రెస్ కమిటీ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట ప్రాంతానికి చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు తాటిపల్లి రాజన్న ను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,చొప్పదండి శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ కమిటీ అగ్రనేత సోనియా గాంధీ,జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే,లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలు,కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు,ఆశయాలకు అనుగుణంగా జిల్లాలోని వ్యాపారులు, వాణిజ్య వర్గాలతో సమన్వయం చేసుకుంటూ వారి సమస్యలు మరియు సూచనలను జిల్లా కాంగ్రెస్ కమిటీ దృష్టికి తీసుకురావడంతో పాటు పరిష్కారం కోసం కృషి చేయాలని, పార్టీ క్రమశిక్షణను పాటిస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని,సేవాభావం, అనుభవం మరియు నాయకత్వంతో వాణిజ్య వర్గాల సంక్షేమానికి,కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాము అని తెలిపారు.



## కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య,నేత్ర వైద్య శిబిరం

మానకొండుర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న విజన్ వీక్ ఆఫ్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సంయుక్తంగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూర్ గ్రామంలో ఉచిత వైద్య,నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.క్లబ్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు,కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, దృష్టి లోపాలను ముందుగానే గుర్తించడం, నివారించగల అంధత్వాన్ని అరికట్టడం ప్రధాన లక్ష్యాలుగా చేపట్టారు.శిబిరంలో గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు,వైద్యుల సంప్రదింపులు, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ పెద్ది విద్యాసాగర్ నాయకత్వం వహించగా,కోఆర్డినేటర్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి,సింగమరాజు,కోల అన్నారెడ్డి, వెంకటాద్రి,డా.తుంగూరి కార్తీక్ తమ సేవలను అందించారు.శిబిరానికి అవసరమైన మందులను స్వస్తిక్ మెడికల్ ఏజెన్సీస్ ద్వారా నర్ల సాయి కృష్ణ స్పాన్సర్ చేశారు.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మ్యాడం శివకాంత్ పటేల్, ముక్క శరత్ కృష్ణ,బట్టు వినోద్ పటేల్, మెతుకు కృష్ణ చైతన్య,ఐత సూరజ్ కుమార్,కంభం ప్రసాద్ పాల్గొన్నారు.



## ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అర్బన్ కరీంనగర్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్/న్యూఢిల్లీ,అక్టోబర్ 13(వాయిస్ టుడే):ఢిల్లీలోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు అరికెల వేణుగోపాల్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే కొంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్,సయ్యద్ అజ్మతుల్లా ఉసేని,ఐవైసీ జనరల్ సెక్రెటరీ శ్రావణ్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఢిల్లీలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్యుల అంజన్ కుమార్,ర్యాలీ వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు వివరించారు. అలాగే కరీంనగర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలు,పార్టీ శ్రేణుల భాగస్వామ్యం,ప్రజల స్పందన తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



## వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### అన్న ప్రసాద వితరణ చేసిన యాదగిరి సునీల్ రావు

కరీంనగర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని భగత్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ యూత్ క్లబ్ సభ్యులు,బిజెపి నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## కనీస అవగాహనతో రొమ్ము క్యాన్సర్ నుంచి విముక్తి

### ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ వంశీ చేతన



కరీంనగర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): ప్రతి ఒక్క వ్యక్తి,స్త్రీలు, పురుషులు తప్పనిసరిగా ప్రాణాంతక రొమ్ము క్యాన్సర్ వ్యాధి పట్ల కనీస అవగాహన కలిగి,తగు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రొమ్ము క్యాన్సర్ నుంచి విముక్తి కలుగుతుందని ప్రముఖ ఆంకాలజిస్టు,సాగర్ క్యాన్సర్ ఆసుపత్రి డాక్టర్ వంశీ చేతన అన్నారు.కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి,ప్రోగ్రాం చైర్మన్‌గా శాతవాహన లయన్స్ క్లబ్ నిర్వహించిన ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన దినోత్సవ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తీవ్రత పెరుగుతోందని,మహిళలు తగు జాగ్రత్తలతో మాసానికి ఒకసారి స్వయంగా తమ రొమ్ములను పరీక్షించుకోవాలని,40 ఏండ్లు దాటిన తర్వాత ప్రతి ఏడాది ప్రత్యేక పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా రొమ్ము క్యాన్సర్ వ్యాధిని నయం చేయడానికి వీలుంటుందని అన్నారు. రొమ్ము క్యాన్సర్ నుంచి విముక్తి పొందిన వ్యక్తులు తమ అనుభవాలను ఇతరులతో పెంచుకోవడానికి ముందుకు రావాలని కోరారు.క్యాన్సర్ వ్యాధి పట్ల ఎలాంటి అపోహలు ఉండకూడదని,ఇది అంటువ్యాధి కాదని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వైద్యశాస్త్రం గుర్తించిన 20,000లకు పైగా వ్యాధుల్లో క్యాన్యర్ లాంటివి అతి ప్రమాదకరమైనవని,ఈ వ్యాధి చికిత్సకు ప్రత్యేక ఆంకాలజీ వైద్యులు అవసరం అవుతున్నారని అన్నారు.దాదాపు 100కు పైగా క్యాన్సర్ వ్యాధుల్లో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అధిక శాతం మహిళా లోకాన్ని కలవరపెడుతుందని అన్నారు. సక్రమమైన జీవనశైలి, పోషకాహారం,శారీరక వ్యాయామం, మానసిక ఆరోగ్యం లాంటివి పలు రకాలైన రోగాలు రాకుండా అడ్డుకుంటాయని అన్నారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ఎం మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి లయన్ ఎన్ వేణుగోపాల్, లయన్ ఎం సత్యనారాయణ రావు, లయన్ డి తిరుపతి రెడ్డి,లయన్ కె సత్యం,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## చంద్రంపేట చౌరస్తా నుండి మొదటి బైపాస్‌ను కలిపి 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 13 (వాయిస్ టుడే): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట ఎక్స్ రోడ్డు నుండి మొదటి బైపాస్ ను కలిపి 80 ఫీట్ల రోడ్డు గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాగా ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీని వలన అక్కడ పంట పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఇట్టి రోడ్డు ఆక్రమణ అవుతున్న ప్రజాప్రతినిధులకు గాని మున్సిపల్ అధికారులకు గాని ఎలాంటి పట్టింపు లేదు. మొదటి బైపాస్ చివరిలో గల చేపూరి బుచ్చయ్య అనే వ్యాపారి తన భూమి లోంచి రోడ్డు పోకుండా ఆటంకాలు కల్పిస్తున్నాడు. బుచ్చయ్య మాత్రం రోడ్డుకు అడ్డంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ బిల్డింగ్ నిర్మాణం కొత్త చెరువు కట్టకింద నాలపై నిర్మాణం యదేచ్ఛగా చేసుకోవచ్చు. గానీ ప్రజలకు ఉపయోగపడే రోడ్డుకు ఆటంకాలు కల్పిస్తుంటే ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు ఎందుకు అతనిపై చర్యలు తీసుకోవడం లేదు. ఇక్కడ రోడ్డు నిర్మాణం వలన చంద్రంపేట ప్రజలతో పాటు శ్రీనగర్ కాలనీ, శాంతినగర్ ప్రజలకు రవాణా మార్గం సులువు అవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ప్రజా ప్రతి నిధులు, మేల్కొని ఇట్టి రోడ్డును త్వరగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఇట్టి రోడ్డుపై టెంట్ వేసి త్వరలోనే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఌ×ఖీఖ(అవష) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం, అన్నారపు శ్రీనివాస్, గుజ్జే దేవదాస్, కొంపెల్లి విజయ్ కుమార్, వేముల మనోజ్, గోవర్ధన్ సిరిమల్ల, బాలసాని రాజు గౌడ్, రాచర్ల ఆంజనేయులు, అన్నారపు తేజ, పోతుగంటి పురుషోత్తం, చిటికెన దేవదాసు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి సీనియర్ కార్యకర్త పబ్బ తిరుపతిని ఫోన్‌లో పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



తిమ్మాపూర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): మండల కేంద్రానికి చెందిన సీనియర్ కార్యకర్త,బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తూ ఆటో పై నుండి కిందపడటంతో ఆయన కాలు ఫ్రాక్చర్ అయి కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.తిరుపతికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు ఫోన్ ద్వారా సూచించారు.ఈ సందర్భంగా బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ పవిత్రమైన భవానీ దీక్షలో ఉండి కూడా,కార్యకర్త సంక్షేమాన్ని గుర్తుంచుకుని ఆరోగ్య పరిస్థితిపై వెంటనే స్పందించడం, ఆయనకు కార్యకర్తలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమని కొనియాడారు.కార్యకర్త కష్టాల్లో ఉన్నాడని తెలిసిన వెంటనే స్పందించి ధైర్యం చెప్పడం అభినందనీయమని,ఈ విషయంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కు తిమ్మాపూర్ మండల బిజెపి పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కండి

### సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలన్ని విజయవంతంగా పూర్తి చేయాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

కరీంనగర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): ఈ నెల 17వ తేదీతో 'సేవా సంకల్ప్ అభియాన్ ముగియనున్న నేపథ్యంలో,పార్టీ నిర్దేశించిన ప్రోగ్రాంలన్నీ విజయవంతంగా పూర్తి చేసేలా,రాబోయే 50 రోజుల పాటు ప్రజా సమస్యలపై,రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మరింత దూకుడుగా పోరాటాలు నిర్వహించేలా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య నేతల సమావేశంలో కీలక దిశానిర్దేశం చేశారు.ఈ మేరకు కరీంనగర్లోని మహాశక్తి దేవాలయ ఆవరణలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ఎన్నికల హామీల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో నిలబడి ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక రాష్ట్ర స్థాయి సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని,అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,ఈ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్లి ఎండగట్టాలని కోరారు.ఈ నెల 17 తర్వాత రాబోయే 50 రోజుల పాటు అనుసరించాల్సిన వివిధ కార్యక్రమాలు,ఆందోళనలు,ధర్నాలపై నేతలకు స్పష్టమైన ప్రణాళికను వివరించారు.కార్యకర్తలు,నాయకులు సమన్వయంతో పనిచేసి చేపట్టబోయే కార్యక్రమాలన్నిటినీ విజయవంతం చేయాలని సూచించారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రజా ఉద్యమాలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి,ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి,కన్న కృష్ణ,సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు,వైదరామానుజం, చేపూరి సత్యం,శ్రవణ్,ముత్యాల జగన్ రెడ్డి, గుంజేటి శివకుమార్,మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్,బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
బుధవారం 14 అక్టోబరు 2026

# వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**వారి న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**

**మాజీ మంత్రి గంగుల కమలాకర్**



కరీంనగర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): వైద్య ఆరోగ్యశాఖలో సుమారు 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలోని జిల్లా సచివాలయం ఎదురుగా నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ.(ఎన్ హెచ్ ఎం జేఏసీ)ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల వెళ్లి మద్దతూ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు.కరీంనగర్ జిల్లాలో సుమారు 500 మంది, రాష్ట్రవ్యాప్తంగా 17 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని, వారిని క్రమబద్ధీకరించడం ప్రభుత్వానికి పెద్ద ఆర్థిక భారం కాదని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని ఆయన కోరారు.20 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగిస్తూ, చివరకు అదే విధానంలో పదవీ విరమణ చేసే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. అర్హులైన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా దొడ్డిదారిన నియామకాలు చేపట్టడం సరికా దన్నారు. ఉద్యోగుల సీనియారిటీ,అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందాలంటే ముందుగా వైద్య ఆరోగ్యశాఖను బలోపేతం చేయాలని గంగుల కమలాకర్ అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి,వారికి రావాల్సిన ప్రయోజనాలు కల్పిస్తేనే వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో విషజ్వరాలు, స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ,తదితర అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో వైద్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని చెప్పారు.కరీంనగర్ నగర అభివృద్ధి పనులపై కూడా గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. నగరంలో రహదారులు,కేబుల్ బ్రిడ్జి,రివర్ ఫ్రంట్,తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. రహదారుల నిర్మాణానికి సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. నగరంలో రహదారులు,వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సమస్యలను రాబోయే అసెంబ్లీసమావేశాల్లో ప్రస్తావించి,వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామగుండం పర్యట ఉన్న సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను కేటీఆర్ కు కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు.వారి సమస్యలను పార్టీ తరఫున రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ కరీంనగర్ అధ్యక్షులు ఈ.రమేష్, ఉపాధ్యక్షులు ఎండి కలిక్,డాక్టర్ వెంకటేష్ వర్కింగ్ ప్రెసిడెంట్,కే రమేష్ జాయింట్ సెక్రెటరీ ఎస్ సాగర్,డిస్టిక్ కో ఆర్డినేటర్, వైద్యులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించాలి

**రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.**

**తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్**

కరీంనగర్,అక్టోబర్ 13(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌నునిరంతరాయంగా అందించాలని తెలంగాణ రక్షణ సేన ఆద్వర్యంలో ఎస్ఈ అఫిస్ ముట్టడి ముందు ధర్నా చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా తక్షణమే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామని.రైతులు సాగు చేస్తున్న పంటలకు అవసరమైన సమయంలో నీరు అందేలా ప్రభుత్వం,విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలి.రైతు దేశానికి వెన్నెముక అని,రైతు కష్టపడి పంటలు పండిస్తేనే ప్రజలందరికీ ఆహారం అందుతుందని అలాంటి రైతన్న వ్యవసాయం చేయడానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కోవడం ఆందోళనకరమైన విషయమని వారు అన్నారు.వర్షాలు సకాలంలో కురవని పరిస్థితుల్లో బోరుబావులే పంటలకు ప్రధాన నీటి వనరుగా మారుతున్నాయిఈ పరిస్థితుల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే రైతులు పంటలకు నీరు అందించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. టిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజుమాట్లాడుతూ రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటనలకు మాత్రమే పరిమితం అయ్యిందని క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి విద్యుత్ నాణ్యత,సరఫరా సమయం,అంతరాయాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ అంకం శివరాణి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్,తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు శ్రీరాముల రమేష్,బుడిగె పర్షారం గౌడ్,బసవేణి రాజేందర్,మ్యాక వినోద్,చంటి శ్రీనివాస్,మ్యాకల తిరుపతి, నాయక్ జంగ అపర్ణ,కొత్తూరి నరేష్,జంపాల రీతిష్,అంబాలా హరీష్,యండి రాజీ,గర్షకుర్తి విద్యాసాగర్,అబ్దుల్ హఫీజ్, కొత్తూరి రఘు,యండి హుస్సేన్,సిపెల్లి వెంకటేష్,మడిపల్లి వినీత్,పూసాల రణధీర్,సూత్రాల రాజన్న,పూసల పవన్,ఉల్లేంగుల నరేష్,నూతి చరణ్, వరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

## వార్డుల పునర్విభజనపై వైఎస్సార్‌సీపీ అభ్యంతరం



శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 13: భౌగోళిక పరిస్థితులను విస్మరించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా సరిహద్దులు మార్చారు అంజూరు తారక శ్రీనివాసులు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియ అశాస్త్రీయంగా, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న 35 వార్డులను 44కు పెంచే క్రమంలో భౌగోళిక పరిస్థితులు, ప్రజల సౌకర్యాలను పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. స్థానిక ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే వార్డుల సరిహద్దులను మార్చారని ఆరోపించారు. మొదట వార్డు పరిధిలోని వి.మం.పల్లి,కేమంపల్లిజైహింద్‌పురం ప్రాంతాల్లో సుమారు 1,694 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను సమీపంలోని రెండో వార్డులో కలిపితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేదని, అలా కాకుండా దూరంగా ఉన్న 42వ వార్డు పరిధిలోని బి.పి. అగ్రహారంలో కలపడం సరికాదన్నారు. అలాగే కైలాసగిరి కాలనీని కొండకు అవతల ఉన్న తుఫాన్ సెంటర్‌తో అనుసంధానం చేయడం, మద్రాసు రోడ్డులోని తంగిడిపాలెంను పిచ్చాటూరు రోడ్డులోని రాజీవ్‌నగర్‌తో కలిపి ఒకే వార్డుగా ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.ఒక ప్రాంతంలోని ఓటర్లను కిలోమీటర్ల దూరంలో ఉన్న వార్డుల్లో కలపడం వల్ల ప్రజలు రోజువారీ సమస్యల పరిష్కారం,మున్సిపల్ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. వార్డుల పునర్విభజనలోని లోపాలను వివరిస్తూ మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డికి లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.కమిషనర్ అభ్యంతరాలు, వినతులను సమగ్రంగా పరిశీలించి, భౌగోళిక పరిస్థితులు, ప్రజల సౌకర్యాలకు అనుగుణంగా వార్డుల సరిహద్దులను పునఃసమీక్షించాలని కోరారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా న్యాయబద్ధంగా పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వార్డుల విభజన సరిచేసిన తర్వాతే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

## దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న అర్జుమంద్ అలీ

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా:శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని పలు కాలనీల్లో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకుల హరీష్, కౌన్సిలర్ నందెడపు చిన్ను, ఆకుల రాధాకృష్ణ, జిల్లా మైనారిటీ చైర్మన్ జునేద్ మోమన్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె. గణేష్, సాయి ప్రతాప్, నరేందర్, ప్రశాంత్, మణికంత తదితరులు పాల్గొన్నారు.





## డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

ఖమ్మం అక్టోబర్ 13 ( వాయిస్ టుడే ): సహచర మిత్రుడు , డ్రైవర్ సదానందం సతీమణి నీరజాక్షి దశదినకర్మలకు హాజరై, దుఖంలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ డ్రైవర్ల సంఘం తరఫున సంఘీభావాన్ని, తెలియజేసి, ధైర్యం చెప్పి కుటుంబ అవసరాల నిమిత్తం, తాము జమ చేసిన ( 20 వేలు ) ఆర్థిక మొత్తాన్ని మిత్రుడు సదానందం కు ఇచ్చి, సంఘం సహకారం ఎప్పుడూ ఉంటుందని హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం కరీంనగర్ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం డి ఓ వారిసు నవాబ్, ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు ఎండి అబ్దుల్ హకీం , మీర్జా గాలిబ్ షేక్ , బి. సతీష్, అనంతరెడ్డి, సర్దార్ మంజిత్ సింగ్ , గంగిపల్లి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ రమేష్ మృతి

# సర్పంచ్ ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా!

**వారం రోజుల పాటు మృత్యువుతో పోరాడి గాంధీ ఆసుపత్రిలో కన్నుమూసిన యువకుడు**

**మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు,**
**మాల సంఘం నాయకుల డిమాండ్**

**సర్పంచ్ దంపతులపై చర్యలు తీసుకోవాలి..**
**రూ.50 లక్షలతో రమేష్ పేరున ట్రస్ట్ ఏర్పాటు చేయాలి**

**కేసు నమోదు చేశాం.. దర్యాప్తులో తేలిన ఆధారాల ప్రకారం చట్టపరమైన చర్యలు: ఏసీపీ విజయ్ కుమార్**



చిగురుమామిడి, అక్టోబర్ 13 (వాయిస్ ఆఫ్ ప్రజలు): కరెంట్ షాక్‌తో తీవ్రంగా గాయపడి వారం రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఓ యువ ఎలక్ట్రీషియన్ చివరకు కన్నుమూశాడు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన కత్తెరమల్ల రమేష్ (28) హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, అతడి మృతికి సర్పంచ్ సాంబారి భారతమ్మ, ఆమె భర్త కొమురయ్య కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు, మాల సంఘం నాయకులు ఆరోపించారు. మృతదేహాన్ని సర్పంచ్ ఇంటి ఎదుట ఉంచి ధర్నాకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**మృతదేహంతో ఆందోళన.. న్యాయం చేయాలని డిమాండ్**

రమేష్ మృతికి బాధ్యులుగా పేర్కొంటున్న సర్పంచ్ దంపతులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా, మృతుడు రమేష్ పేరుతో రూ.50 లక్షలతో ట్రస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకు తమ ఆందోళనను విరమించబోమన్న రీతిలో బంధువులు, సంఘం నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు.

**సర్పంచ్ దంపతుల తీరుపై కుటుంబ సభ్యుల ఆరోపణలు**

మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో రమేష్‌కు సాంబారి కొమురయ్యతో పలు వివాదాలు, సమస్యలు ఉన్నాయని ఆరోపించారు. రమేష్ జీవించి ఉన్న సమయంలో అతడిని వివిధ అవసరాలకు ఉపయోగించుకున్నారని, అయితే అతడు మరణించిన అనంతరం కనీసం పరామర్శించేందుకు గానీ, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గానీ ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాన్ని తమ ఇంటి వద్దకు తీసుకొచ్చినా తనకు సంబంధం లేదని కొమురయ్య చెప్పినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. గ్రామంలో కొమురయ్య వ్యవహారశైలిపై వివిధ సామాజిక వర్గాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని కూడా వారు ఆరోపించారు. గతంలో జరిగిన పరిణామాలతోపాటు, ప్రస్తుత ఘటనపై సమగ్ర విచారణ జరిపి సర్పంచ్ దంపతులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల అధికారిక వివరణ అందుబాటులో ఉన్నట్లు నిర్ధారణ కాలేదు.

**గ్రామంలో భారీగా పోలీసుల మోహరింపు**

మృతదేహంతో సర్పంచ్ ఇంటి ఎదుట ధర్నా చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గ్రామంలో భారీగా మోహరించారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఆందోళనకారుల డిమాండ్లను విన్న అధికారులు, ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

**కేసు నమోదు చేశాం.. దర్యాప్తు కొనసాగుతోంది: ఏసీపీ**

ఈ ఘటనపై ఏసీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. సంఘటనకు సంబంధించి సాంబారి కొమురయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విచారణలో లభించే ఆధారాల ప్రకారం దోషులుగా నిర్ధారణ అయిన వారిపై తప్పనిసరిగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించి నలుగురు పోలీసుల అదుపులో ఉన్నారని, వారిని మంగళవారం ఉదయం జైలుకు తరలించనున్నట్లు తెలిపినట్లు వివరించారు. మృతుడు తిరిగి రాని లోటును ఎవరూ పూడ్చలేరని, అయితే బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. ఘటనపై సంబంధిత వ్యక్తులు స్పందించాల్సిన అవసరం ఉందని, ఆందోళనకారులు కోరుతున్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. మృతదేహం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో చర్చలు జరిపి బాధిత కుటుంబానికి తగిన సహాయం అందేలా నిర్ణయం తీసుకునే అంశాన్ని పరిశీలిద్దామని ఏసీపీ సూచించినట్లు తెలిసింది.

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్**

ఓ యువకుడి మృతి అనంతరం చోటుచేసుకున్న ఈ పరిణామాలు చిన్న ముల్కనూర్ గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రమేష్ మృతికి దారితీసిన ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు, బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రమేష్ మృతితో ఓ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోగా, న్యాయం కోసం సాగుతున్న పోరాటం ఇప్పుడు పోలీసుల దర్యాప్తు, అధికారుల స్పందనపై కేంద్రీకృతమైంది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చి బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందా అన్నది వేచి చూడాలి.

# కాజీపేటకు రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

**పాఠశాల నిర్మాణానికి పరిపాలన మంజూరైన అనుమతులు**

**ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన..**

**సుమారు 1,500 మంది విద్యార్థులకు విద్యావకాశం**

**రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు**







కాజీపేట, అక్టోబర్ 13 (వాయిస్ టుడే): కాజీపేట మరియు చుట్టుపక్కల ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల జాబితాలో వరంగల్ పశ్చిమనియోజకవర్గం లోని కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రూ.10 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట మండల కేంద్రం విద్యానగర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల(పెద్దబడి) ప్రాంగణంలో ఈ పాఠశాల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే చోట విద్యను అభ్యసించే అవకాశం విద్యార్థులకు కలగనుంది. దీంతో కాజీపేటతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

### అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక వసతులు..

తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఆధునిక విద్యా ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఇందులో విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా వసతులు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా అనుకూలమైన వాతావరణం కల్పించడమే ఈ పాఠశాల ప్రధాన ఉద్దేశంగా ఉండనుంది. సుమారు 1,500 మంది విద్యార్థులకు విద్యను అందించే సామర్థ్యంతో పాఠశాల ఏర్పాటు కానుందని భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలను విస్తరించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడంపై బీసీ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించే సంస్థ ఏర్పాటుతో స్థానిక విద్యార్థులకు ఉన్నత తరగతుల వరకు ఒకే ప్రాంగణంలో చదువుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కాజీపేట ప్రాంతంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కావాలనే ప్రజల చిరకాల ఆకాంక్షకు ఈ నిర్ణయం ఊతమిస్తుందని అభిప్రాయపడ్డారు. స్థానిక విద్యార్థులు ఇంటికి సమీపంలోనే ఉన్నత విద్యను అభ్యసించేందుకు, తల్లిదండ్రులకు దూర ప్రాంతాలకు పంపాల్సిన అవసరాన్ని తగ్గించేందుకు ఈ పాఠశాల ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు

కాజీపేటకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడానికి కృషి చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి పెరుమాండ్ల సాంబమూర్తి బీసీ టీచర్స్ యూనియన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాల ఏర్పాటు ప్రాంతీయ విద్యారంగ అభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి, అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చి పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. పాఠశాల పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే కాజీపేట విద్యారంగంలో మరో కీలక ముందడుగుగా నిలిచే అవకాశం ఉంది.

### కాజీపేట అభివృద్ధి ప్రధాత నాయిని..

ఎన్నో ఏండ్లు గా కుంటపడి ఉన్న కాజీపేట పట్టణానికి మంచిరోజులు వచ్చాయి. పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే, కాజీపేట అభివృద్ధి ప్రధాత నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాజీపేట అభివృద్ధి ప్రారంభమైంది. కాంగ్రెస్ అంటే అభివృద్ధి అనే మాటకు ఎమ్మెల్యే నాయిని నిర్వచనం చూపించారు. కాజీపేటలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి అమడంత దూరంగా ఉన్న తరుణంలో నాయిని రాజేందర్ రెడ్డి అభివృద్ధి పై దృష్టి సారించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి కాజీపేట పట్టణ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

## దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి**

**అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి**

**శ్రీకాళహస్తి సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బీ.పావని**



శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 13: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ డీఎస్పీగా బీ.పావని సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. ఇంటి భద్రతకు ముందస్తు చర్యలు తప్పనిసరి ప్రయాణానికి వెళ్లే ముందు ఇంటి తలుపులకు బలమైన తాళాలు వేయాలని, కిటికీలు సక్రమంగా మూసివేయాలని, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ డీఎస్పీగా బీ.పావని సూచించారు. ఇంటి ముందు వార్తాపత్రికలు, పాల ప్యాకెట్లు పేరుకుపోకుండా వాటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. ఇలా పేరుకుపోవడం వల్ల ఇల్లు ఖాళీగా ఉందనే విషయం దొంగలకు తెలిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలి ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించారు. తాము ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయాలని, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రయాణానికి సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి కాలనీలు, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ డీఎస్పీగా బీ.పావని కోరారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలను గమనిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రజలు దసరా పండుగను ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని, తమ ఇళ్ల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ డీఎస్పీగా బీ.పావని విజ్ఞప్తి చేశారు.



## వడ్తాల్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**మహిళా సంఘాల భవన నిర్మాణ పనులకు శ్రీకారం**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా ముధోల్ మండలం వడ్తాల్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సంఘాల భవన నిర్మాణాలకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామానికి మంజూరైన భవనాల నిర్మాణ పనులను ప్రారంభించే కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ కరిపే రమేష్, ఉపసర్పంచ్ ఆడపు సాయి చరణ్, ఎంపీవో, ఏపీఎంతో పాటు పంచాయతీ సెక్రటరీ సురేష్, సాంకేతిక సహాయకుడు దేవదాస్, క్షేత్ర సహాయకుడు భూమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి వస్తే గ్రామ పరిపాలనకు మరింత సౌలభ్యం కలుగుతుందని, మహిళా సంఘాల భవనం ద్వారా సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా సభ్యుల ప్రమాణ స్వీకారం

**తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరికీ సామాజిక సేవకులకు సన్మానం**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 13: తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన. తర్వాత. దశాబ్ద కాలం గడిచిన తర్వాత నిర్మల్ జిల్లాలో. మొట్టమొదటిసారిగా. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యొక్క ఎన్నికలు. రాష్ట్రం. లోనే. ఏకగ్రీవంగా ప్రథమముగా జరిగి. 13. అక్టోబర్ 26న. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో. ఎన్నికైనటువంటి. జిల్లా కార్యవర్గానికి. ఎన్నికల అధికారి. మరియు అదేవిధంగా. జిల్లా ఆరోగ్యశాఖ అధికారి. తదితర అధికారులు. నూతనంగా జిల్లా చైర్మన్గా ఎన్నుకోబడిన. జి.జనార్ధన్ గారిని. తదితర 14 మంది వారి కార్యవర్గాన్ని. ఉదయం 11 గంటలకు. ఘనంగా ప్రమాణ స్వీకారం మహోత్సవం జరిగింది. మరియు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అందరికీ వివిధ పార్టీ నాయకులు సామాజిక కార్యకర్తలు సంఘాలు ఘన సన్మానం చేశారు. మరియు తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో కూడా అధ్యక్షులు షేక్ ముజాహిద్ ఉపాధ్యక్షులు సాజిద్ ప్రధాన కార్యదర్శి అల్మాస్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరికీ పూలతో శాలువతో ఘన సన్మానం చేయడం జరిగింది. ప్రమాణ స్వీకారం తర్వాత ఎన్నికల అధికారులు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరికీ ప్రొసీడింగ్ అందజేశారు.

## అంబులెన్స్‌లోనే కవలల ప్రసవం.. ఇద్దరూ ఆడపిల్లలే!

**108 సిబ్బంది సమయస్ఫూర్తితో సురక్షిత ప్రసవం**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా కుంటాల మండలంలో 108 అత్యవసర సేవల సిబ్బంది సమయస్ఫూర్తితో అంబులెన్స్‌లోనే కవలల ప్రసవం విజయవంతంగా నిర్వహించారు. లింబా (కే) గ్రామానికి చెందిన దామిని, భర్త రాజు, అనే గర్భిణి ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చారు.కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పురిటినొప్పులతో బాధపడుతున్న దామినిని ఆసుపత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌ను పిలిపించారు. ఆసుపత్రికి తీసుకెళ్తున్న మార్గమధ్యంలో ప్రసవ నొప్పులు తీవ్రం కావడంతో అప్రమత్తమైన 108 అత్యవసర వైద్య సాంకేతిక నిపుణురాలు వీణా, అంబులెన్స్ పైలట్ గోపి వెంటనే స్పందించారు.పరిస్థితిని అర్థం చేసుకున్న సిబ్బంది అంబులెన్స్‌లోనే అవసరమైన వైద్య సహాయం అందించి ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించారు. దామిని ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.ఆపత్కాలంలో సకాలంలో స్పందించి, సమయస్ఫూర్తితో వైద్య సేవలందించిన 108 సిబ్బంది వీణా, గోపిలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు అందించిన సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

తొర్రూరు, అక్టోబర్ 13 వాయిస్ టుడే : పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి హైదరాబాదులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం పట్ట భద్రుల నుంచి అత్యధికంగా కాంగ్రెస్ కు ఓట్లు పడేలా సహకరించాలని సర్వోత్తమ రెడ్డి కోరారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మేరకు నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని గుర్తు చేశారు. ఏందిరా నిరుద్యోగులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దసరాకు స్వగ్రామాలకు వచ్చే ఓటర్లను గుర్తించి నమోదు చేయిస్తామని గుర్తు చేశారు.ప్రజా ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించాలని సూచించారు.



## కాజీపేటకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

**పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ప్రయోజనకరం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాయినికి కృతజ్ఞతలు**

**బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ నాయకుల సంబరాలు**

కాజీపేట, అక్టోబర్ 13 (వాయిస్ టుడే): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేటకు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కాజీపేట చౌరస్తాలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పసునూరి మనోహర్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాజీపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపిక చేయడం ఈ ప్రాంత విద్యార్థులకు, తల్లిదండ్రులకు శుభవార్త అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ పాఠశాల మంజూరైందని వారు తెలిపారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్యను అందించే ఈ విధానం పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధితో మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చి కాజీపేట విద్యారంగంలో మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కాజీపేట ప్రజల తరఫున సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రహమతుల్లా మహమ్మద్ అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుష్, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, ఎన్ఎస్‌యూఐ మాజీ జాతీయ కోఆర్డినేటర్ రహమతుల్లా మహమ్మద్, నాయకులు సయ్యద్ రజాలీ, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, దర్గా పీఏసీఎస్ డైరెక్టర్ బుర్ర బాబురావు, మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ టబు, రంగు సుధీర్, నాగపురి రామ్‌కీ గౌడ్, పోగుల సతీష్, కిరణ్, కాదాసీ సులోచన తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

**మాజీ ఛీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

**ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు దాస్యం మద్దతు..**

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 13 (వాయిస్ టుడే): ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మద్దతు ప్రకటించి, సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు కీలకమని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

**ఉద్యోగుల సమస్యల పరిష్కారం ప్రభుత్వ బాధ్యత..**

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర హక్కుల సాధన కోసం సమ్మె చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడాలంటే ఉద్యోగులకు తగిన గుర్తింపు, గౌరవం, భద్రత కల్పించాలని సూచించారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం వారి పోరాటానికి భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు తన మద్దతు కొనసాగుతుందని భరోసా ఇచ్చారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
VOICE OF PRAJALU
హైదరాబాద్
బుధవారం 14 అక్టోబరు 2026

# గ్రామ పంచాయతీ అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి: సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా



భద్రాచలం, అక్టోబర్ 13: భద్రాచలం గ్రామపంచాయతీలో నెలకొన్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని భద్రాచలం కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా స్వచ్ఛ పాలన అందించాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ప్లే కార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులలో అనేక అక్రమాలు జరిగాయి అని ఇటీవల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నత అధికారులు స్పందించాలని కోరారు. పంచాయతీలో నెలకొంటున్న అక్రమాల ప్రభావంతో పాలకవర్గంలో సైతం చీలికలు వస్తున్నాయని అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు కూడా అనేక ఒక తోకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు సైతం బలంగా వినిపిస్తున్నాయని ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాలని నరసారెడ్డి డిమాండ్ చేశారు.

**ఇంటి యజమానుల వద్ద లివసూలు చేస్తున్న డెవలప్మెంట్ చార్జీలను రద్దు చేయాలి**

దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి పన్నులు వేయాలిలి

పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలి

డెవలప్మెంట్ చార్జీల పేరుతో ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న చార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించుకున్న ప్రతి ఇంటికి ప్రభుత్వం అధికారులే సర్వే చేసి ఇంటి పనులు వేయాలని కోరారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం డెవలప్మెంట్ చార్జీలు వచ్చి వస్తువులు చేయాల్సిన వస్తే అది కేవలం వాణి భవనాలకు మాత్రమే పరిమితం కావాలని నివాస గృహాలకు డెవలప్మెంట్ చార్జీలను వసూలు చేయడం వెంటనే ఉపసంహరించుకోవాలని స్వామి డిమాండ్ చేశారు. అదేవిధంగా నివాస ప్రాంతాలలో పెరిగిపోతున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. భద్రాచల పట్టణ ప్రజలకు ఇసుకను అందుబాటులో తీసుకొచ్చే విధంగా గ్రామపంచాయతీ తీర్మానం చేయాలని గడ్డం స్వామి కోరారు.

**ఆరోపణలపై సమగ్ర రిపోర్టు అందించాలని డిపిఓకి సబ్ కలెక్టర్ ఆదేశం**

గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా అనంతరం సిపిఐఎం శ్రేణులు ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ మృణాలు శ్రేష్ఠ వినతి పత్రం అందించారు. సిపిఐఎం ఇచ్చిన వినతి పత్రంపై స్పందించిన సబ్ కలెక్టర్ సమగ్ర రిపోర్టును తనకి ఇవ్వాలని డిపిఓ కి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ గ్రామపంచాయతీ పై జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పారిదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తామని సిపిఎం శ్రేణులకు హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ అవినీతి అక్రమాలపై సబ్ కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల సిపిఐఎం శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగ భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి, 20వ వార్డు సభ్యురాలు ఇర్పా అనసూయ పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, నకిరికంటి నాగరాజు, కొలగాని రమేష్,జీవనజ్యోతి, ఎస్ అజయ్ కుమార్ నకిరేకంటి నాగరాజు, కుంజ శ్రీనివాస్, చుక్క మాధవరావు, సంద్ర భూపేంద్ర, డి కనక శ్రీ, అంబోజి రత్నం, సీనియర్ నాయకులు బీబీజీ తిలక్ పాల్గొన్నారు.



## ఉద్యోగ భద్రత కల్పించాలి

**సమ్మె బాట పట్టిన జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా :తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు సమ్మెకు దిగారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు బైఠాయించి నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రతతో పాటు తమ కుటుంబాలకు భరోసా కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కరోనా విపత్కర సమయంలోనూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించామని గుర్తుచేశారు. ఇంత సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు ఉద్యోగ భద్రత, కుటుంబ భద్రత కల్పించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## అమరవేణి నర్సా గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులు చంద్రన్న ప్రజా సంఘాల నాయకులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అమరవేణి సిద్ధార్థ బహుజన్ గౌడ్ ది నెల మాసికం ఈరోజు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ మావోయిస్టు మాజీ కేంద్ర కమిటీ నాయకులు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న ఆదివాసి ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గంట సత్యం టి ఏ కె ఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బంటు శ్రీనివాస్ ప్రజాసంఘాల నాయకులు పెద్ది రాజన్న ఇంజనీర్ పోచన్న తోటరాజు లింగు ఎం .నర్సయ్య ఏ రాజేశ్వర్ వివిధ ప్రజాసంఘాల గౌడ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. సిద్ధార్థ బహుజన్ గౌడ్ తల్లి తండ్రులను అమరవేణి నర్సాగౌడ్ నిర్మల మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు.



## బాసర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం బాసరలో పర్యటించిన కలెక్టర్ ఆలయ పనుల పురోగతిని పరిశీలించి, వ్యర్థాలు తొలగించి, గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షించి, ఘాట్లను పరిశీలించారు. భక్తుల స్నానాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, నీటిపారుదల శాఖ ఈఈ అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.





## రూ.24.45 కోట్లతో 80 అడుగుల రహదారి నిర్మాణం

**రేణిగుంట మండలంలో పనులకు భూమిపూజ చేసిన తుడా చైర్మన్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 13: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించిన తుడా రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట మండలంలో మరో కీలక రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్‌హెచ్-71 నుంచి కొట్టమంగలం రోడ్డు వరకు రూ. 24.45 కోట్ల అంచనా వ్యయంతో 80 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న రహదారికి తుడా చైర్మన్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన ప్రమాణాలతో పనులు చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సులభతరమవుతాయని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు స్థానిక ప్రాంతాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులను కార్యరూపంలో చూపించడమే తమ ప్రభుత్వ నిబద్ధత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాణ్యమైన రహదారుల నిర్మాణంతో ప్రజల రవాణా కష్టాలను తగ్గించి, సురక్షిత ప్రయాణానికి బాటలు వేస్తామని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం.అన్నదానం



రాయికల్ ( వాయిస్ టుడే) : రాయికల్ పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ దేవాలయం ప్రాంగణంలోని అమ్మవారి మండపం లో రుద్రాభిషేకం జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల శివనామస్మరణ మధ్య రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు మరియు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సేవ సంఘం సభ్యులు మాట్లాడుతూ భగవంతుని కృపతో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రుద్రాభిషేకం ద్వారా సమాజంలో శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, మున్సిపల్ చైర్మన్ రవి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావుతో పాటు విశ్వపాలిని సేవా సమితి సభ్యులు, స్థానిక ప్రముఖులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణిగుంటలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

**రూ.15 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి**



శ్రీకాళహస్తి(వాయిస్ టుడే) అక్టోబర్ 13 రేణిగుంట: పట్టణంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రేణిగుంట పట్టణంలోని బుగ్గ వీధి, కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద రూ. 10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ఒడ్డిమెంట శ్మశానవాటిక వద్ద రూ. 5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ రహదారుల నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని చెప్పారు. పట్టణంలోని ప్రతి వీధిలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తూ రేణిగుంట పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాసరలో 3వ రోజు చంద్రఘంటా అలంకారంలో జ్ఞాన సరస్వతి అమ్మవారు



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 13: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో శారదీయ దసరా నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అక్టోబర్ 11న ప్రారంభమైన ఈ ఉత్సవాలు 20వ తేదీ విజయదశమి వరకు కొనసాగనున్నాయి. మూడవ రోజైన ఈరోజు మంగళవారం అమ్మవారు చంద్రఘంటా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శిరస్సుపై ధరించిన అర్ధచంద్రుడు ఘంటాకృతిలో ఉండటమే ఈ నామానికి మూలం. బంగారు కాంతులతో,పది చేతులలో ఆయుధాలు ధరించి సింహ వాహనంపై కొలువుదీరిన ఈ రూపం భక్తుల కష్టాలను శీఘ్రంగా తొలగించి అభయాన్ని ప్రసాదిస్తుంది. తెల్లవారుజామున 4 గంటలకు మంగళ వాయిద్యాలతో అమ్మవారికి మహాభిషేకం, అనంతరం చండీ హోమం,కలశ స్థాపన, నిత్యార్చనలు నిర్వహించారు. ఈ రోజు చంద్రఘంటా అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈరోజు అమ్మవారికి కొబ్బరి అన్నం నైవేద్యంగా సమర్పించారు. వ్యాస మహర్షి తపస్సు చేసిన పుణ్యక్షేత్రంగా, అక్షరాభ్యాసాలకు ప్రసిద్ధి చెందిన బాసరలో ఉదయం నుండే భక్తులు భారీగా తరలివచ్చారు. బాలాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో అంజనీ దేవి ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు,ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**